
సాక్షి
అనంతపురం

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.6 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.1°/22.6°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ధర లేకుంటే గోదాములను వినియోగించుకోండి



మాట్లాడుతున్న శ్యామ్‌కుమార్

అనంతపురం అగ్రికల్చర్: పంట ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకుంటే వెంటనే ప్రభుత్వ గోదాములను వినియోగించుకోవాలని రైతులకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్యామ్ కుమార్ సూచించారు. గోదాముల వినియోగంపై రుద్రంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం స్థానిక రైతులకు ఆయన అవగాహన కల్పించారు. ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనప్పుడు గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చునన్నారు. తిరిగి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభ్యమైనప్పుడు విక్రయించి, సొమ్ము చేసుకోవచ్చునన్నారు. గోదాముల్లో నిల్వ చేసిన పంట ఉత్పత్తులకు అవసరమైతే 80 శాతం బ్యాంకు రుణసదుపాయం కల్పిస్తారన్నారు. అనంతరం స్థానిక గుత్తిరోడ్డులో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ గిడ్డంగుల సంస్థ కార్యాలయంలో గోదాములను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ హనుమంతరెడ్డి, సహకార శాఖ అధికారి బాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల అమ్మకాలు నిలిపివేత



అనంతపురం అగ్రికల్చర్: అనుమతుల్లేని ఎరువుల విక్రయాలు నిలుపుదల చేస్తూ ఏడీఏ ఎం.రవి, ఏఓ శశికళ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఉదయం గ్రీన్ గ్రో న్యూట్రియంట్ లిమిటెడ్ దుకాణాల్లో చేపట్టిన తనిఖీల్లో అనుమతి పత్రాలు లేని రూ.7,62,600 విలువ చేసే ఎరువులను గుర్తించారు. వీటికి సరైన అనుమతి పత్రాలు సమర్పించకుంటే సీజ్ చేసి 6-ఏ కేసు నమోదు చేస్తామని నిర్వాహకులను హెచ్చరించారు.

ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి : పీటీడీఓ

అనంతపురం సెంట్రల్: ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రజారవాణా విభాగం(పీటీడీ) అధికారి సుమంత్.ఆర్.ఆదోని ఉద్యోగులకు సూచించారు. గ్యారేజ్ నిర్వహణపై డిపో సూపర్‌వైజర్లతో బుధవారం ఆయన సమీక్షించారు. ఆదాయంలో సగం డీజిల్ కొనుగోలుకే వెచ్చిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిగణిస్తూ ఇంధనం ఆదాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్గమధ్యంలో బస్సులు మొరాయించకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ మెకానికల్ ఇంజినీర్ మోహన్‌కుమార్, అన్ని డిపోల గ్యారేజ్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

రయ్ రయ్

రోడ్లపై బైక్‌లు దూసుకెళ్తున్నాయి. ఒకదానిని మించి మరొకటి పోటీ పడుతున్నాయి. వేగం.. మైలేజీ.. స్టైల్.. ప్రత్యేక ఫీచర్లతో కూడిన బైకులను వివిధ కంపెనీలు తయారుచేసి మార్కెట్లోకి తెచ్చాయి. వినియోగదారుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో బైకుల అమ్మకాలు జోరందుకున్నాయి. షోరూముల్లోకి అలా రాగానే.. ఇలా కొనుగోలు చేసి రోడ్లపై రయ్‌మని తిప్పుతున్నారు.

- ద్విచక్ర వాహనాల విక్రయాలు జోరు..
- 100 సీసీ దాటిన టూవీలర్లకు గిరాకీ
- ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 5వేల వాహనాల రిజిస్ట్రేషన్
- బైక్‌ల అమ్మకం టర్నోవర్ ఏడాదికి రూ.500 కోట్లకు పైనే



ఉమ్మడి జిల్లాలో అమ్మకాలు

నెలకు సగటున టూవీలర్ అమ్మకాలు
5,000

ఏడాదికి సగటు అమ్మకాలు
60,000

ఏడాదికి అమ్మకాల టర్నోవర్
రూ.**500** కోట్లు పైనే

ఒక్కో బండి సగటు కనిష్ట ధర
రూ.**1,00,000**



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ద్విచక్ర వాహనాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. డిమాండు భారీగా ఉండటంతో ఆటోమొబైల్ రంగంలో టూవీలర్ అమ్మకాలు పరుగులు పెడుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో కార్ల అమ్మకాలు దూకుడు పెరిగిన విషయం తెలిసిందే. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా ద్విచక్రవాహనాల వ్యాపారం రూ.500 కోట్లకు పైగా జరుగుతున్నట్టు అంచనా. తాజా పరిస్థితులు, మార్కెట్‌లో అమ్మకాలు చూస్తుంటే 100 సీసీ బైకులు తక్కువ అమ్ముడుపోతున్నాయి. బైకు కెపాసిటీ 100సీసీ దాటిందంటే లక్ష రూపాయలు పైన చెల్లించాల్సిందే.

భారీగా పెరిగిన వాహనాల ధరలు

గతంలో బీఎస్4 మోడల్ వాహనాలు ఉండేవి. కాలుష్యం నియంత్రించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా వచ్చే వాహనాలు ఏవైనా బీఎస్6 (భారత్ స్టేజ్ ఎమిసన్ స్టాండర్డ్ 6)కు ఉండాలని నిర్దేశించింది. దీంతో ఒక్కో వాహనంపై సగటున రూ.15వేలు పెరిగినట్టు డీలర్లు చెబుతున్నారు. వాహనాల తయారీలో గతంతో పోలిస్తే టెక్నాలజీ కూడా మారింది. స్పీడు మొదలుకొని అన్నీ డిజిటల్ కొలమానాలే వచ్చాయి. దీంతో టూవీలర్ సామాన్యులకు కాస్త దూరం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

గేర్‌లేని వాహనాలకూ భారీ గిరాకీ

గేర్ వాహనాలకే కాదు గేర్ లేని స్కూటీలాంటి వాహనాలకూ భారీగా గిరాకీ పెరిగింది. యాక్టివా, జూపిటర్, యాక్సెస్ వంటి వాహనాలు ఏవైనా లక్ష రూపాయలు పైనే ఉన్నాయి. మరోవైపు 350 సీసీ వాహనాలైన రాయల్ ఎన్‌ఫీల్డ్, హోండా హైనెస్ వంటి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. 350 సీసీ వాహనం కనిష్టం రూ.2.50 లక్షలు పలుకుతోంది. కాలేజీ కుర్రాళ్లు ఎక్కువ మంది 350 సీసీ వాహనాలపై మక్కువ చూపుతున్నారు.

మార్కెట్‌లో వివిధ రకాల ద్విచక్ర వాహనాల తాజా ధరలు ఇలా

కేటగిరీ	ధర (రూ.)
హోండా షైన్ 125 సీసీ	1,12,000
యూనికార్న్ 150 సీసీ	1,50,000
బజాజ్ పల్సర్ 125 సీసీ	1,20,000
బజాజ్ పల్సర్ 150 సీసీ	1,48,600
బజాజ్ పల్సర్ 200 సీసీ	1,75,000
హీరో స్ప్లెండర్ ప్లస్ 100 సీసీ	98,500
హీరో సీడీ డీలక్స్ 100 సీసీ	85,000
టీవీఎస్ జూపిటర్ 125 సీసీ	1,18,000

బీఎస్6కు మారడంతో రేట్లు పెరిగాయి



బీఎస్4 నుంచి బీఎస్6కు మారడంతో ఒక్కో వాహనంపై సగటున రూ.15 వేలు పెరిగింది. ప్రస్తుతం వస్తున్న వాహనాల్లో ఏదైనా సమస్య వస్తే కంప్యూటర్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. దీనివల్ల మార్కెట్‌లో ఈ వాహనాలకు డిమాండ్ పెరిగింది.

– మల్లికార్జున, హోండా కంపెనీ డీలర్

కాలుష్య నియంత్రణలో భాగంగానే..



కొత్తగా వచ్చిన బీఎస్6 వాహనాలకు రేట్లు బాగా పెరిగాయి. గతంలో కంటే ఇంజిన్‌లో ప్రత్యేకతలు వచ్చాయి. కాలుష్య నియంత్రణలో భాగంగా ఇలా చేశారు. దీనివల్ల ఏ వాహనం తీసుకున్నా కనిష్టంగా లక్ష రూపాయలు తక్కువ లేదు.

– వీర్రాజు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

నేటితో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ పూర్తి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఎన్నికల కమిషన్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం పోలింగ్ కేంద్రాల (పీఎస్‌ల) హేతుబద్ధీకరణ ప్రక్రియ గురువారంతో ముగుస్తుందని కలెక్టర్ గౌతమి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ, పీఎస్‌ల హేతుబద్ధీకరణ, తదితర అంశాలపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల తొలగింపుపై క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన పూర్తి చేశామన్నారు. ఇంటింటి సర్వే పూర్తయిన తరువాత వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల దృష్టికి ఏ విధమైన ఫిర్యాదులు వచ్చినా తమకు తెలియజేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పూర్తి చేశామన్నారు 1,500 మంది కంటే అధికంగా ఓటర్లు ఉంటే మిగిలిన ఓటర్లకు మరో పోలింగ్ కేంద్రం ప్రతిపాదించవచ్చన్నారు. రెండు కిలోమీటర్ల పరిధిలోపు పోలింగ్ స్టేషన్ ఉండాలని, ఏఈఆర్‌ఓలు వ్యక్తిగతంగా 100 శాతం పరిశీలన చేసి కేంద్రాల మార్పులు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్న భవనం అన్ని విధాలా అనువుగా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల విషయంలో ఏవేని సమస్యలను రాజకీయ పార్టీలు గుర్తించి తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. అక్టోబరు 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. కొత్త ఈవీఎంలు జిల్లాకు చేరాయన్నారు. అక్టోబరు 4న రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మొదటి దశ తనిఖీ చేపడతామన్నారు. సమావేశంలో ఎన్నికల డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమెన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- అతివేగంతో వాహనాలు నడపొద్దు
- పోలీసుల సూచనలు పాటించాలి
- మీడియాతో ఎస్పీ అన్బురాజన్



ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ తప్పిదాల కారణంగా జరుగుతున్న ప్రమాదాల్లో ప్రాణాలు పోరాదన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. యువకులు త్రిబుల్ రైడింగ్.. మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారన్నారు. అలాంటి వారిపై నిఘా పెంచామన్నారు. తల్లిదండ్రులు మీ పిల్లల సౌకర్యం కోసం ఇచ్చిన ద్విచక్ర వాహనాలు వారి ప్రాణాలు మీదకు తెచ్చుకునే పరిస్థితి రాకుండా అవగాహన కల్పించాలన్నారు. సాధారణంగా రాత్రి వేళ నిద్రమానుకుని మరీ ప్రయాణాలు చేయడం సురక్షితం కాదన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. పది రూపాయలు సంపాదించాలన్న ఆశతో పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను తరలించడం సరైంది కాదన్నారు. నగరంలో నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలపాలని సూచించారు. సింగిల్ లైన్ మార్కింగ్‌లో మాత్రమే ఉంచాలన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. ప్రాణాలతో చెలగాటమాడే రైడింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. సైలెన్సర్లు తొలగించి అధిక శబ్దం వచ్చేలా వాహనాలు నడపకూడదని తెలిపారు. జిల్లాలో అతి పెద్ద జాతీయ రహదారులున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే ప్రమాదాలకు కారణమైన 36 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. రోడ్డు దాటాలన్న ఆతృతతో పాటు కొంత దూరమైనా నిబంధనల ప్రకారం వెళితే ఎలాంటి ముప్పు ఉండదన్నారు. చాలామంది రోడ్డు డివైడరు పైకెక్కి వాహనాల్లో అడ్డంగా రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాంటి సందర్భాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

క్షతగాత్రులను కాపాడుదాం

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సత్వర చికిత్సలందించి ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ కోరారు. అత్యవసర సేవలందాలంటే ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలందించాలన్నారు. ప్రజల సహకారం చాలా అవసరమన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యం

- 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి



అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం కార్పొరేషన్: సంక్షేమ పథకాల అమలులో అర్హులకు ఎదురైన ఇబ్బందులను అధిగమించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం' నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో 'జగనన్నకు చెబుదాం' అనంతపురం అర్బన్ మండలస్థాయి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు అధికారులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 48 అర్జీలు స్వీకరించారు. నిర్దేశిత గడువులోపు అర్జీలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 'జగనన్నకు చెబుదాం' టోల్ ఫ్రీ నంబర్ 1902కి ఫోన్ చేస్తే ఫిర్యాదుదారుల అర్జీను నమోదు చేసుకుని సంబంధిత అధికారులకు పంపుతున్నారన్నారు. ఈ ప్రక్రియను సీఎంఓ స్థాయిలో పర్యవేక్షిస్తారని, గడువులోపు అర్జీలను నాణ్యతగా పరిష్కరిస్తున్నారా లేదా అని తనిఖీ చేస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందించడంతో పాటు వివిధ పథకాలకు అర్హత కల్గించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మరో అడుగు ముందుకువేస్తూ బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

30 నుంచి వైద్య శిబిరాలు

ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తోందని కలెక్టర్ గౌతమి తెలిపారు. కొత్తగా మరో ఐదు వైద్య కళాశాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. తద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం వచ్చిన తర్వాత ప్రతి నెలా షెడ్యూల్ ప్రకారం డాక్టర్లు రెండుసార్లు గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలందిస్తున్నారన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమమైన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, తద్వారా ప్రతి పౌరుడి హెల్త్ రికార్డుని నమోదు చేసే మంచి కార్యక్రమమన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓలు, తదితర వైద్య సిబ్బంది ఇంటింటా హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించి, అందులో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి టోకన్ అందిస్తారన్నారు. ఆరోగ్యశ్రీ కింద అందించే 3,256 సేవల వివరాలు, ఎంపానల్ ఆస్పత్రుల వివరాలు, వివిధ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తామన్నారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, తక్కువ బరువుకల్గిన చిన్నారులు తదితరులకు ఈ నెల 30 నుంచి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జరిగే వైద్య శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్ల ద్వారా వైద్య చికిత్సలందిస్తామన్నారు. సమస్య తీవ్రతను బట్టి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్డీఓ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఆరోగ్యశ్రీ డీసీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గణపతి బప్పా మోరియా !



యాడికిలో నిమజ్జనం సందర్భంగా వినాయక విగ్రహాల శోభాయాత్ర

జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో కొలువుదీరిన గణేశ్ ప్రతిమలు మూడురోజుల ప్రత్యేక పూజల అనంతరం బుధవారం నిమజ్జనానికి తరలాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను తీసుకెళ్లారు. శోభాయాత్ర వైభవంగా సాగింది. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై అంటూ పిల్లలు, యువకులు, పెద్దలు, మహిళలు నినదించారు. డప్పువాయిద్యాల నడుమ సాగిన ర్యాలీలో యువత లయబద్ధంగా నృత్యాలు చేస్తూ.. ఈలలు, కేకలతో హోరెత్తించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషంగా ముందుకు సాగారు. నిమజ్జనం ప్రశాంతంగా సాగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. – సాక్షి బృందం



తాడిపత్రి ఆలూరుచెరువులో నిమజ్జనానికి తీసుకొచ్చిన బొజ్జగణపయ్య విగ్రహం

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా మాణిక్యాలరావు



అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.మాణిక్యాలరావు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఓబీజీ విభాగాధిపతిగా ఉన్న మాణిక్యాలరావున పదోన్నతిపై (అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) ఖాళీగా ఉన్న అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా వస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ (ఎఫ్ఏసీ) ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి ఎస్‌పీఎం ప్రొఫెసర్‌గా కొనసాగనున్నారు. త్వరలో ఆమెకు పదోన్నతి రానుందని వైద్య కళాశాల వర్గాలు తెలిపాయి.

'జగనన్న ఆరోగ్య సురక్ష' కంట్రోల్ రూం ఏర్పాటు

అనంతపురం మెడికల్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి సంబంధించి కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి తెలిపారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా ఈ నెల 30 నుంచి నిర్వహించే వైద్య శిబిరాల్లో అందించే సేవలు, సాంకేతికపరమైన సందేహాలుంటే ఈ కంట్రోల్ రూం 72888 77941, 62819 29488, 73863 13431 నంబర్లకు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.

వైభవం.. సిడిమాను ఉత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోట మారెమ్మ, నేసేపేట దండుమారెమ్మ, కొల్లాపురమ్మ ఆలయాల వద్ద సిడిమాను ఉత్సవం వైభవంగా జరిగింది. దుగ్గిలమ్మ జాతర మరుసటి రోజు సిడిమానుకు యువకుడు లేదా బాలుడిని కట్టి తిప్పడం ఇక్కడి ఆచారం. కోట మారెమ్మ ఆలయం వద్ద సిడిమాను ఉత్సవానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం 6 గంటలకు సిడికి యువకుడిని కట్టి మూడుసార్లు తిప్పారు. దుగ్గిలమ్మ గుడి ఆలయ పూజారి వంశస్తులకు చెందిన వ్యక్తులను సిడికి కట్టి తిప్పారు. భక్తులు అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. మారెమ్మ ఆలయం వద్ద ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్, వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.





సిడిమానుకు యువకుడిని కట్టి తిప్పుతున్న దృశ్యం (ఇన్‌సెట్) మారెమ్మదేవి మూలవిరాట్

క్లుప్తంగా

విద్యుత్ హైఓల్టేజీతో నష్టం


ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

రాయదుర్గంటౌన్: స్థానిక 27వ వార్డు పరిధిలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంతంతో పాటు కశేగార్ వీధిలో విద్యుత్ హైఓల్టేజీతో కారణంగా భారీ నష్టం వాటిల్లింది. బుధవారం ఉదయం 8 గంటలకు వందకుపైగా ఇళ్లకు ఒక్కసారిగా హైఓల్టేజీ సరఫరా అయింది. దాదాపు 30 ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, విద్యుత్ మోటార్లు, చార్జింగ్‌కు ఉంచిన మొబైల్ ఫోన్లు, ఫ్యాన్‌లు, లైట్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ నిజాముద్దీన్ అక్కడకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. సమస్యకు మూల కారణాన్ని అన్వేషించి, నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అధికారులతో చర్చిస్తామన్నారు. కాగా, ఘటనపై విద్యుత్ శాఖ ఏఈ బాలు మాట్లాడుతూ... న్యూట్రల్ ఫెయిల్ కావడంతో హైఓల్టేజీ సరఫరా అయిందన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.

జిల్లాకు 1,368 మెట్రిక్ టన్నుల ఎరువులు


ఎరువులు పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: కోరమాండల్ కంపెనీ నుంచి 1,368 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ రవి తెలిపారు. బుధవారం గార్లదిన్నె ఏఓ సోమశేఖర్‌తో కలసి స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఎరువుల వ్యాగన్‌ను ఆయన పరిశీలించారు. 753 మెట్రిక్ టన్నుల 28–28–0 రకం ఎరువులు, 615 మెట్రిక్ టన్నుల 20–20–13 రకం ఎరువులు సరఫరా అయినట్లు వివరించారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు ఆర్బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. మరికొన్ని మార్క్‌ఫెడ్, కంపెనీ గోదాముల్లో నిల్వ చేస్తామని తెలిపారు.

దోసిత్తనంపై అద్భుతం

- సూక్ష్మ కళలో రాణిస్తున్న ఆర్టీసీ కండక్టర్ వివేకానంద
- గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నం
- ఇప్పటికే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డుకు చేరువగా




దేశవిదేశాలకు చెందిన నాణేలను పరిశీలిస్తున్న వివేకానంద, దోస విత్తనంపై చిత్రీకరించిన మూత్రపిండ వ్యవస్థ, అగ్గిపెట్టె సైజులో రాసిన భగవద్గీత

కళ్యాణదుర్గం: బియ్యపు గింజలు... సుద్దముక్కలు.... సబ్బు బిళ్లలు... పెన్సిళ్లు... కాదేదీ కళకు అనర్హం అన్నట్టు తన సూక్ష్మ కళతో ఆర్టీసీ కండక్టర్ వివేకానంద అద్భుత చిత్రాలు ఆవిష్కరిస్తున్నారు. అక్షరాలను సూక్ష్మంగా రాస్తూ మైక్రో ఆర్టిస్ట్‌గా అవతారమెత్తి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కోసం ప్రయత్నిస్తున్నారు. దోసకాయ విత్తనాలతో పాటు బియ్యం గింజలపై 189 తెలుగు అక్షరాలు, వందేమాతర గీతం, వేమన పద్యాలు రాసి అందరి చేత ప్రశంసలు అందుకున్నారు. దోసకాయ విత్తనాలపై గాంధీ, మూత్ర పిండాల వ్యవస్థ, తాజ్‌మహల్, ఏసు శిలువ, పడవ, గుడిసె తదితర బొమ్మలను చిత్రీకరించారు. బియ్యపు గింజపై సెలవుచీటి రాసి అందరినీ అబ్బురపరిచారు. సుద్దముక్కపై సైన్స్‌కు సంబంధించిన అనేక అంశాలతో పాటు జంతువుల బొమ్మలూ వేశారు. అగ్గిపుల్ల, నారు పోగులపై ఏ నుంచి జడ్ వరకూ ఆంగ్ల అక్షరాలు లిఖించి ఆకట్టుకున్నారు. అలాగే పురాతన నాణేల సేకరణపై సైతం మక్కువ పెంచుకున్న ఆయన ఇప్పటి వరకూ భారతదేశంతో పాటు బెల్జియం, జర్మనీ, ఆఫ్ఘనిస్తాన్, ఫ్రాన్స్, ఇటలీ తదితర దేశాలకు చెందిన సుమారు 300కు పైగా నాణేలు సేకరించారు.

గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకునేలా

కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన ఎం.వివేకానంద కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. 1995లో డిగ్రీ చదువుతున్న సమయంలోనే సూక్ష్మ కళతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవచ్చునని తెలుసుకున్న వివేకానంద తాను కూడా మైక్రో ఆర్టిస్ట్‌గా రాణించాలని భావించారు. అప్పటి నుంచి తన సాధనను మొదలు పెట్టిన ఆయన సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో పోస్టుకార్డుపై 2,058 ఇంగ్లిష్ అక్షరాలతో 'జై సమైక్యాంధ్ర' అనే నినాదాన్ని ఏపీ చిత్ర పటం ఆకారంలో లిఖించారు. అగ్గిపుల్లలపై జై సమైక్యాంధ్ర నినాదాన్ని 76 అక్షరాలతో, బియ్యపు గింజపై 14 అక్షరాలతో రాశారు. ప్రస్తుతం ఆయన అగ్గిపెట్టెలో పట్టేంత చిన్నపాటి పుస్తకంలో భగవద్గీత రాస్తున్నారు. ఇప్పటి వరకూ 9 పర్వాలు పూర్తయ్యాయి. కాగా, 2 సెం.మీ. వెడల్పు, 3 సెం.మీ. పొడవు పరిమాణంలో ఉన్న పుస్తకంలో మాత్రమే భగవద్గీత రాసినట్లుగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ఉంది. ఈ రికార్డును అధిగమించేలా 1.8 సెం.మీ. వెడల్పు, 2.8 సెం.మీ. పొడవు (అగ్గిపెట్టె) పరిమాణంలో ఆయన భగవద్గీత రాస్తూ గత రికార్డును బద్ధలుగొట్టే దిశగా ప్రయత్నిస్తూనే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్‌కు చేరువయ్యారు.

గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంటా



మనసుంటే మార్గం ఉంటుంది అనే నమ్మకంతో ముందుకు పోతున్నా. ఇప్పటి వరకూ దోస విత్తనాలు, బియ్యపు గింజలపై ప్రముఖుల చిత్రాలతో పాటు సైన్స్‌కు సంబంధించిన అంశాలను చిత్రీకరించాను. ప్రస్తుతం అగ్గిపెట్టెలో పట్టేంత పరిమాణమున్న పుస్తకంలో భగవద్గీత రాస్తున్నా. ఎలాగైనా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంటా.

– ఎం.వివేకానంద, ఆర్టీసీ కండక్టర్

గణనాథుడికి కలెక్టర్ పూజలు


పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: గణాధిపతి కృపకు అందరూ పాత్రులై సంతోషంగా ఉండాలని కలెక్టర్ గౌతమి ఆకాంక్షించారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం, రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక సంఘం సంయుక్తంగా కృష్ణకళామందిర్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను కలెక్టర్ బుధవారం సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, నాయకులు సంజీవరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం


జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఉదయం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్‌కు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడం శుభ పరిణామమన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లుకు ఆమోదం దక్కాలని ఆకాంక్షించారు. 2027 నుంచి కాకుండా 2024 ఎన్నికల్లోనే రిజర్వేషన్‌ను అమలులోకి తీసుకువస్తే బాగుంటుందన్నారు. మహిళల స్థితిగతులు మెరుగుపడితేనే సమాజాభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం వైఎస్ జగనన్న.. నామినేటెడ్ పదవులతో పాటు ప్రత్యక్ష ఎన్నికల్లో ఏకంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితోనే కేంద్ర ప్రభుత్వం 30 శాతం రిజర్వేషన్‌కు చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

బ్యాటరీల షాప్‌లో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న స్థానికులు

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న బ్యాటరీల షాపులో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గుత్తికి చెందిన సుల్తాన్.. బ్యాటరీల షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తన వ్యాపార లావాదేవీలు ముగించుకుని దుకాణం మూసేసి ఇంటికెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం 9 గంటలకు దుకాణం వద్దకు చేరుకున్నాడు. అప్పటికే షాప్‌లో నుంచి దట్టమైన పొగలు వస్తుండడం గమనించి, స్థానికుల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాడు. అప్పటికే విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూరుబీ, కమిషనర్ శ్రీనివాసులు పంపిన మూడు ట్యాంకర్ల నీటితో మంటలను అదుపు చేయగలిగారు. ఘటనలో రూ.6 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకుల బలవన్మరణం

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది అర్ధంతరంగా తనువు చాలించారు.


రుషికేష్ మృతదేహం

- **పామిడి:** స్థానిక నెహ్రూ కాలనీలో నివాసముంటున్న రుషికేష్ రావు (36)కు వైఎస్సార్ జిల్లాకు చెందిన రాజేశ్వరి బాయితో వివాహమైంది. ద్విచక్ర వాహనాల మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఐదు నెలల క్రితం దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో రుషికేష్‌పై రాజేశ్వరిబాయి వేధింపుల కేసు పెట్టింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన.. మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎద్దులపల్లి రోడ్డులోని రైల్వే ట్రాక్‌పై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు రుషికేష్ మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో గుత్తి జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.
- **తాడిపత్రి:** స్థానిక రమేష్‌రెడ్డి కాలనీకి చెందిన బోయిన కోటేశ్వరరావు (35) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. 2016లో ఆయనను భార్య లక్ష్మి వదిలేసి వెళ్లింది. అప్పటికే వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త నుంచి ఆమె విడిపోయే సమయంలో పెద్ద కుమార్తెను తన వెంట పిలుచుకెళ్లింది. రెండో కుమార్తె మానసతో కలసి తల్లి లక్ష్మీ కాంతమ్మ వద్దే కోటేశ్వరరావు ఉంటున్నారు. భార్య విడిపోయి మరో వ్యక్తిని పెళ్లాడినప్పటి నుంచి కోటేశ్వరరావు మానసికంగా కుదేలయ్యాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన బుధవారం తెల్లవారుజామున పుట్లూరు రోడ్డు రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

యువకుడి దుర్మరణం


మృతుడు ఉపేంద్ర

రాయదుర్గం టౌన్: మారుతి ఓమినీ వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం కొంతానపల్లికి చెందిన ఉపేంద్ర(23), ఓబులేసు బుధవారం సాయంత్రం కర్ణాటకలోని మొలకాల్మూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రాయదుర్గం పరిధిలోని పైతోట సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై కర్ణాటకకు వెళుతున్న మారుతీ ఓమినీ వాహనాన్ని ఢీకొన్నారు. ఘటనలో ఉపేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. ఓబులేసుకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి


మృతిచెందిన విజయ్

బత్తలపల్లి: వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. నీటి కుంటలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం ఈదులముష్టూరులో వినాయక చవితి వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తూ వచ్చారు. గ్రామానికి చెందిన బొలిగొండ లక్ష్మణ్ణ, లింగమ్మ దంపతుల ఏకైక కుమారుడు విజయ్ (18) తన స్నేహితులతో కలసి ఓ విగ్రహాన్ని ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువులో వినాయకుడి ప్రతిమను నిమజ్జనం చేస్తుండగా విజయ్ అదుపు తప్పి కుంటలో పడి బురదలో కూరుకుపోయాడు. రక్షించేందుకు స్నేహితులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడే ఉన్న గజ ఈతగాళ్లు, పోలీసులు స్పందించి వెలికి తీసేలోపు మృతి చెందాడు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడు విజయ్ అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నట్లు సమాచారం.

నడి రోడ్డుపై సమాధి!

పావగడ: కొన్నేళ్ల పాటు పోరాటాలు సాగించినా శ్మశాన వాటికకు అనువైన స్థలాన్ని కేటాయించకపోవడంతో ఓ మృతదేహాన్ని నడిరోడ్డుపై ఖననం చేసి గ్రామస్తులు వినూత్న నిరసన వ్యక్తం చేశారు. వివరాలు... పావగడ తాలూకా నిడుగల్ హోబళికి చెందిన క్యాతగానహళ్లిలో గతంలో ప్రభుత్వ పోరంబోకు భూమిని శవ సంస్కారాలకు వినియోగించుకునేవారు. కొన్నేళ్ల క్రితం ఆ భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారు. దీంతో మృతదేహాలను ఖననం చేసేందుకు స్థలం లేక గ్రామస్తులు పలుదఫాలుగా అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం దక్కలేదు. దీంతో గ్రామస్తులు విసిగిపోయారు. ఇటీవల ఆ గ్రామానికి చెందిన ఈరణ్ణ మృతి చెందడంతో ఆయన దేహాన్ని తీసుకెళ్లి గ్రామ శివారున నడిరోడ్డుపై ఖననం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరదరాజు ఆగమేఘాలపై ఆ గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ప్రభుత్వ భూమిని సర్వే చేయించి శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తామని గ్రామస్తులకు హామీనిచ్చారు.

దండిస్తే.. దాడి చేశారు !

- దొరిగిల్లు క్వార్టర్స్‌లో దారుణం
- వినాయకుడి విగ్రహం ఎదుట యువకుల బైక్ విన్యాసాలు
- అడ్డుచెప్పిన గ్రామస్తులపై దాడి.. ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు


అనంతయ్య (ఫైల్)

ముదిగుబ్బ: వినాయకుడి విగ్రహం ఎదుట బైక్‌లతో విన్యాసాలు ఏమిటని ప్రశ్నించిన వారిపై దాడి చేయగా ఒకరు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి మండల పరిధిలోని దొరిగిల్లు క్వార్టర్స్‌లో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వినాయక పండుగ సందర్భంగా దొరిగిల్లు క్వార్టర్స్‌లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొందరు యువకులు విగ్రహం ఎదుట బైక్‌పై విన్యాసాలు చేశారు. దీంతో గ్రామస్తులు యువకులను మందలించారు. దీంతో సదరు యువకులు దొరిగిల్లు గ్రామంలోకి వెళ్లి వారి కుటుంబ సభ్యులు, బంధువులను తీసుకొచ్చారు. అక్కడే ఉన్న గ్రామస్తులతో ఘర్షణ పడ్డారు. మాటామాటా పెరగడంతో ఇరువర్గాలూ కర్రలతో దాడి చేసుకున్నాయి. ఈ ఘటనలో అనంతయ్య (55) అనే వ్యక్తి తలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ముదిగుబ్బకు తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘర్షణలోనే గాయపడిన ఆంజనేయులు, నారాయణమ్మ, తులసి, నాగముణమ్మ, వెంకటనారాయణను చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యతీంద్ర, లా అండ్ ఆర్డర్ సీఐ హేమంత్‌కుమార్ అర్ధరాత్రి సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బుధవారం ఉదయం అడిషనల్ ఎస్పీ విష్ణు దొరిగిల్లు క్వార్టర్స్‌కు చేరుకొని ఘర్షణకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ ఘటనలో 13 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో 13 మంది

దొరిగిల్లు క్వాటర్స్‌లో మంగళవారం చోటు చేసుకున్న ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన 13 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఘటనకు సంబంధించి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి


మృతుడు నాగేంద్ర

గార్లదిన్నె: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ఇల్లూరుకు చెందిన నాగేంద్ర(25)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి గ్రామంలోకి నడుచుకుంటూ వెళుతుండగా తరిమెల నుంచి అనంతపురం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో నాగేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నేడు 'వందేభారత్' ట్రయల్ రన్

అనంతపురం సిటీ: కాచిగూడ–యశ్వంత్‌పూర్ మధ్య వందేభారత్ రైలు ట్రయల్ రన్‌ను గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ బుధవారం రాత్రి వెల్లడించారు. కాచిగూడలో బయలుదేరిన రైలు మహబూబ్‌నగర్, కర్నూలు, డోన్ మీదుగా గురువారం ఉదయం 11 గంటలకు అనంతపురానికి చేరుకుంటుంది. ధర్మవరం, యశ్వంత్‌పూర్ వరకూ ట్రయల్‌రన్ కొనసాగుతుంది.

నిమజ్జనంలో ఘర్షణ - యువకులపై దాడి

పెనుకొండ రూరల్: వినాయకుడి నిమజ్జనంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం కోనాపురానికి చెందిన రమణ బుధవారం చేపట్టిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమానికి ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్లాడు. అయితే అక్కడ ముగ్గురు యువకులు వాగ్వాదానికి దిగి రమణపై దాడి చేశారు. ఘటనలో తీవ్ర గాయాలైన రమణను ఆస్థానికులు వెంటనే పెనుకొండలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు.

- మరువపల్లి గ్రామానికి చెందిన వడ్డి వెంకటేష్ అదే గ్రామంలో బుధవారం చేపట్టిన వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్నాడు. విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు ఘర్షణ పడ్డారు. రాత్రి వెంకటేష్ తన ఇంట్లో ఉండగా యువకులు దౌర్జన్యంగా లోపలకు చొరబడి విచక్షణారహితంగా దాడి చేశారు. అడ్డుకోబోయిన వెంకటేష్ తల్లి రామలక్ష్మిపై సైతం దాడి చేయడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఉన్నత విద్యలో 'షేరింగ్'

- నాలెడ్జ్ షేరింగ్, ట్రాన్స్‌ఫర్‌కు వీలుగా నిర్ణయం
- యూజీ, పీజీ, పరిశోధన కోర్సుల్లో అమలు

అనంతపురం: అత్యున్నత ప్రమాణాలతో కూడిన బోధన, ఇతర అంశాల్లో విద్యా సంస్థల మధ్య ఇచ్చిపుచ్చుకునే (షేరింగ్) ధోరణికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) శ్రీకారం చుట్టింది. 'నాలెడ్జ్ షేరింగ్ – నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్' నినాదంతో ఓ విద్యాసంస్థలోని టెక్నాలజీని, ఇతర వనరులను మిగిలిన సంస్థలు ఉమ్మడిగా వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలులోకి వస్తే సెంట్రల్ వర్సిటీలు సహా దేశంలోని అన్ని ఉన్నత విద్యా సంస్థల్లోని వనరులను సమీపంలోని వనరులు లేని ఇతర ఉన్నత విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ తమ విద్యార్థుల్లో నైపుణ్యాలు తీర్చిదిద్దేందుకు ఈ విధానం దోహదపడనుంది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు పరిశోధన కోర్సుల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

రెట్టింపు ఫలితాలు

యూజీసీ తీసుకున్న 'నాలెడ్జ్ షేరింగ్ – నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్' విధానం ద్వారా రెట్టింపు ఫలితాలు ఉంటాయని విద్యావేత్తలు అంటున్నారు. అకడమిక్ అంశాలు సహా ఏదైనా అభివృద్ధి కార్యకలాపాలను సమగ్రంగా అమలు చేయాలంటే అదనపు సదుపాయాలు అవసరమవుతాయి. ఇందుకోసం ఆయా సంస్థలు అదనపు పెట్టుబడి పెట్టాలి. అలా కాకుండా.. ఉన్నత విద్యా సంస్థలు పరస్పర సహకారంతో ఇప్పటికే అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటే రెట్టింపు ఫలితాలు వస్తాయి.


సమానమైన విద్యను ఆర్జించేలా

విద్యా పరమైన మౌలిక వనరులు పలు కళాశాలల్లో లేకపోవడంతో ఉన్న వనరులతోనే ఆయా కళాశాలలు నెట్టుకొస్తున్నాయి. దీంతో విద్యార్థులకు సమానమైన విద్య అందక నైపుణ్యాలు కొరవడి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనుకబాటుకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఇతర వనరులున్న సంస్థల్లో చదివే విద్యార్థులతో సమాన విద్యావకాశాలను అందిపుచ్చుకునేలా యూజీసీ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉన్న వనరులను పంచుకునేలా ఆయా సంస్థల మధ్య జరిగే ఒప్పందాలతో విద్యార్థులందరికీ మేలు చేకూరనుంది. అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టుగాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులన్నిటికీ ఈ విధానాన్ని అమలు చేయాలని యూజీసీ సూచించింది. ఆయా విద్యాసంస్థల్లో ఉన్న తరగతి గదులు, ల్యాబ్‌లు ఇతర వనరుల సమాచారాన్ని సమీపంలోని ఉన్నత విద్యాసంస్థలకు తెలిసేలా వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. వీటిని వినియోగించుకునే ఇతర ఉన్నత విద్యా సంస్థల నుంచి నిర్దిష్ట వనరులకు సాధారణ కనీస ఛార్జీలు నిర్ణయించి వసూలు చేయవచ్చునని సూచించింది. ఆ కనీస ఛార్జీల వివరాలూ అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

అవగాహన ఒప్పందాలతో ముందడుగు

ఉన్నత విద్యా సంస్థల్లోని వనరులను పరస్పర భాగస్వామ్యంతో వినియోగించుకునేందుకు వీలుగా ఆయా సంస్థలు తొలుత అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలని యూజీసీ సూచించింది. ఏ సమయంలో ఏ సంస్థ విద్యార్థులు వనరులు వినియోగించుకోవాలో సమగ్ర ప్రణాళికను రూపొందించి ఆ ప్రకారం కార్యచరణ అమలుకు కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతర వనరులు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా సంస్థలు చర్యలు చేపట్టాలని, ఏ ఒక్క తరగతి ఖాళీగా ఉంచకుండా చూసుకోవాలని యూజీసీ స్పష్టం చేసింది. అకడమిక్ అంశాలకు సంబంధించి ఆన్‌లైన్ బోధనలు, వీడియోలు, లెర్నింగ్ మెటీరియల్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను ఇచ్చిపుచ్చుకోవచ్చునని పేర్కొంది. విద్యార్థుల నమోదు ప్రక్రియ మొత్తం ముందుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా పూర్తి చేయాలని, శిక్షణ, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించుకోవచ్చునని సూచించింది. పరిశోధన స్థాయిలో వనరుల భాగస్వామ్యం అనేది ఆయా పరిశోధకుల స్థాయిలో ఉండాలని, పీజీ స్థాయిలో వనరుల షేరింగ్ విభాగాల వారీగా లేదా సంస్థాగత స్థాయిలో ఉండొచ్చునని స్పష్టం చేసింది.

క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు

అనంతపురం అర్బన్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలంటూ మహజన సోషలిస్ట్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు కదిరప్ప మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో గత, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు పోరాటం సాగిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నారాయణ స్వామి జయంతి

అనంతపురం కల్చరల్: నగరంలోని లలిత కళా పరిషత్తులో సుప్రసిద్ధ రంగస్థల నటుడు గాజుల నారాయణస్వామి జయంతిని గురువారం నిర్వహించనున్నారు. బుధవారం ఎల్కేపిలో జరిగిన సమావేశంలో సంస్థ అధ్యక్ష కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, పద్మజ మాట్లాడారు. కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నాటక అకాడమీ చైర్మన్ ప్రమీల, మేయర్ వసీం హాజరవుతారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం రూరల్: అంధ బాలుర ఆశ్రమంలో అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. టవర్ క్లాక్ దగ్గర ఉన్న అంధ బాలుర ఆశ్రమాన్ని శాంతి నగర్‌లో ఉన్న నూతన భవనంలోకి మార్చడంతో బుధవారం నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఆశ్రమంలో అంధ బాలురకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. బాలురపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. కార్యక్రమంలో వయోవృద్ధులు వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



భాగవత సప్తాహంలో పాల్గొన్న ఎండోమెంట్ సలహాదారుడు శ్రీకాంత్

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఏపీ ఎండోమెంట్ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. నగరంలోని రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో వారం రోజుల పాటూ సాగే భాగవత సప్తాహాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దేవాదాయశాఖ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తోందన్నారు. సాయిట్రస్టు వారు భాగవత సప్తాహం చేయడం అభినందనీయమన్నారు. ట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 26 వరకు భాగవత సప్తాహం జరుగనుందన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త అన్నాజీ గురుదేవులు రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ భాగవతంలోని సూక్ష్మాలను వివరిస్తారన్నారు. తొలిరోజు అన్నాజీ భాగవతంలోని పలు ఘట్టాలను వివరించారు.

వైద్యాధికారికి సన్మానం



వైద్యాధికారి శ్రావణిని సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: మీ అందరి కృషి వల్లనే పీహెచ్‌సీకి అవార్డ్ వచ్చిందని వైద్యాధికారి శ్రావణి అన్నారు. పీహెచ్‌సీకి ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అసురన్స్ స్టాండర్స్) జాతీయ నాణ్యత ప్రమాణాలు హామీ సర్టిఫికెట్ వచ్చిన సందర్భంగా వైద్యాధికారి శ్రావణిని వైద్య సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. పీహెచ్‌సీకి నేషనల్ క్వాలిటీ అసురన్స్ స్టాండర్స్ సర్టిఫికెట్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అవార్డు రావాడానికి కృషి చేసిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

భై భై.. గణపయ్య

అనంతపురం కల్చరల్: వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. బుధవారం మండపాల వద్ద సందడి నెలకొంది. మధ్యాహ్నం పలు చోట్ల పెద్ద ఎత్తున అన్నదానాలు జరిగాయి. రామనగర్‌లో శాంతి హోమం నిర్వహించారు. మొదటి రోడ్డులో వరసిద్ధి వినాయక విగ్రహం ముందు మహిళలు బారులు తీరి పూజలు చేపట్టారు. ఐదవ రోడ్డులో భారీ ఎత్తున అన్నదానం చేపట్టారు. వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్నప్పుడు పెద్ద ఎత్తున జనసందోహం గుమిగూడి ఆటపాటలతో విఘ్నేశ్వరుడికి వీడ్కోలు పలికారు. అశోక్‌నగర్, శారదా నగర్, ఎస్కేయూ రోడ్డులో కొలువైన గణపయ్యలను పండమేరుకు తరలించారు. సాయినగర్, కోవూరునగర్, రామనగర్ తదితర వినాయకులు కొడిమి సమీపంలో నిమజ్జనం చేశారు. భక్తిగీతాల నడుమ స్వామిని గంగమ్మ ఒడికి తరలించారు.

ఆత్మకూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం విగ్రహాల నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోల్లో కొలువుదీర్చి ఊరేగించారు. యువత డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. ఆత్మకూరు, పి.యాలేరు, పంపనూరు, కొత్తపల్లి, పంపనూరు తండా గ్రామాల్లోని వినాయకులను పంపనూరు వద్ద ఉన్న హంద్రీనీవా కాలువలో నిమజ్జనం చేశారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం గణేష్ నిమజ్జనం వేడుకగా సాగింది. కనగానపల్లితో పాటు తగరకుంట, మద్దెలచెరువు, మామిళ్లపల్లి, ముక్తాపురం, తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మూడు రోజులు పాటు పూజలందుకున్న గణపయ్యలను భక్తులు సాయంత్రం ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, వంకల్లో నిమజ్జనం చేశారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పాతపాల్యం కొత్తూరు గ్రామంలో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన వేలంలో లడ్డూ ప్రసాదం రూ.40,100 ధర పలికింది. నారాయణ రెడ్డి కుమారులు ప్రసాదాన్ని దక్కించుకున్నారు.



ఆత్మకూరులో చిన్నారులు, యువత సందడి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో కోలాహలంగా గణేష్ నిమజ్జన ఉత్సవాలు జరిగాయి. వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గణ నాయకుడి విగ్రహానికి గత మూడు రోజులుగా పూజలు నిర్వహించారు. బుధవారం గణేషుడి నిమజ్జనం పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థినులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రాప్తాడు: మూడు రోజుల పాటు విశేష పూజలందుకున్న బొజ్జ గణపయ్య బుధవారం గంగ ఒడికి చేరాడు. మండల వ్యాప్తంగా మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోల్లో వినాయకులను ఊరేగించారు. జై గణేశా.. జైజై గణేశా.. జై బోలో గణేష్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. రంగులు చల్లుకుంటూ, టపాసులు పేల్చుతూ యువత సందడి చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని పండమేరు వంక, చెరువులు, వంకలు, బోరుబావుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి, ఇటుకులపల్లి సీఐ నరేంద్ర రెడ్డి, రాప్తాడు ఎస్ఐలు ఆంజనేయులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కనగానపల్లి: మామిళ్లపల్లిలో వినాయకులను నిమజ్జనానికి తరలిస్తోన్న భక్తులు



ఎస్కేయూలో..



ఎస్కేయూలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



అనంతపురం ఐదో రోడ్డులో వినాయక మండప నిర్వాహకుల సందడి



రాప్తాడు: ట్రాక్టర్‌లో నిమజ్జనానికి వెళ్తున్న వినాయకుడు

జగదీష్ కుటుంబానికి చేయూత



జగదీష్ కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు అందిస్తున్న డాక్టర్ నిర్మల

అనంతపురం కల్చరల్: ఇటీవల మరణించిన జగదీష్ అవయవాలను మరో నలుగురికి దానం చేసి ప్రాణం పోసిన ఆయన కుటుంబ సభ్యులకు నిత్య సురభి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు డాక్టర్ నిర్మలా మురళీ అండగా నిలిచారు. బుధవారం బుక్కరాయసముద్రం మండలానికి వెళ్లి జగదీష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం, మరో రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు అందజేశారు. జగదీష్ అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సహస్రమోదుక గణపతి హోమం



హోమాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

అనంతపురం కల్చరల్: వినాయక చతుర్థి పర్వదినాల ముగింపు వేడుకల సందర్భంగా తపోవనంలోని అభినవ కుల సుందరి పీఠం ఆధ్వర్యంలో బుధవారం సహస్ర మోదుక గణపతి హోమం ఘనంగా జరిగింది. పీఠం వ్యవస్థాపకుడు, వేదపండితుడు రాకేష్ శర్మ నేతృత్వంలో పలువురు రుత్వికులు హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రాలు, భక్తిగీతాలతో ప్రాంగణం మార్మోగింది. మధ్యాహ్నం స్వామికి నైవేద్యంగా సమర్పించిన వేల కుడుములతో పాటు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కృష్ణ చైతన్య, ఆకాష్, సాయిదత్త కిషోర్, సులలిత తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయం

- ఎస్కేయూ యూనివర్సిటీ బోర్డు మెంబర్ తోపుదుర్తి నయనతారెడ్డి



ఆత్మకూరు: అన్ని రంగాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. చట్టసభల్లో కూడా మహిళల ప్రాతినిధ్యం పెరిగేలా లోక్‌సభలో మహిళా బిల్లును ప్రవేశపెట్టడం హర్షణీయమని ఎస్కేయూ యూనివర్సిటీ బోర్డు మెంబర్ తోపుదుర్తి నయనతారెడ్డి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారన్నారు. 50 శాతం పదవులు మహిళలకే కేటాయించారని తెలిపారు.

వాటర్ కూలర్ వితరణ



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: శ్రీ బాలాజీ నర్సింగ్ హోం నిర్వాహకులు డాక్టర్ కోడె అంజనీకుమార్, డాక్టర్ జూటూరు పద్మ దంపతులు రూ.60 వేలు విలువ చేసే వాటర్ కూలర్‌ను బుధవారం జీజీహెచ్‌లోని హౌస్‌సర్జన్ హాస్టల్‌కు అందజేశారు. హౌస్‌సర్జన్ హాస్టల్‌లో వాటర్ కూలర్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్, హౌస్‌సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

అనంతపురం సిటీ: ఉద్యోగులు తమ పని తీరు మార్చుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హెచ్చరించారు. అనంతపురంలోని ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలోని వివిధ కీలక విభాగాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్లానింగ్ సెక్షన్‌ను తనిఖీ చేశారు. అక్కడి నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కు వెళ్లారు. అక్కడ కొందరు ఏఓలతో పాటు ఇతర విభాగాల సిబ్బంది ఉండడంతో మీ సీట్లు వదిలి ఇక్కడికి ఎందుకొచ్చారంటూ ప్రశ్నించారు. కంప్యూటర్ సెక్షన్, కీలకమైన అకౌంట్స్ విభాగాన్ని సందర్శించారు. అక్కడి ఏఓ డిప్యూటీ సీఈఓ చాంబర్‌లో ఉండగా, మరో మహిళా ఉద్యోగినికి మాత్రమే ఉన్నారు. మిగిలిన సీట్లన్నీ ఖాళీగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. ఆయా సీట్లల్లోని సిబ్బంది ఎక్కడికెళ్లారంటూ ప్రశ్నించగా.. భోజనాలకు వెళ్లారని సిబ్బంది చెప్పారు. దీంతో 12 గంటలకే ఏం భోజనం అంటూ చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, పని తీరు మార్చుకోవాలని సూచించారు. బి సెక్షన్‌తో పాటు పీఎఫ్ సెక్షన్‌లోని ఉద్యోగులందరూ తమ తమ సీట్లల్లో కూర్చొని పని చేస్తుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఓ చాంబర్‌లో ఫైళ్లన్నీ పెండింగ్‌లో ఉండటంతో సిబ్బందిని మందలించారు. ఏ ఒక్క ఫైలు పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదన్నారు.



పీఎఫ్ సెక్షన్ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని నిమజ్జన ప్రదేశాలు, శోభాయాత్రలను బుధవారం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు. అలాగే స్థానిక చెరువుకట్ట వద్ద ఏర్పాటు చేసిన రెండు నిమజ్జన ప్రదేశాలు, కొడిమి, రాచానపల్లి పాయింట్లను సందర్శించారు. అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఇప్పటి వరకూ ఎన్ని ప్రతిమలను నిమజ్జనం చేశారు? ఇంకా ఎన్ని రావాలి అని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జనాన్ని ప్రశాంతంగా ముగించాలని సూచించారు. గణేష్ ఊరేగింపును పరిశీలించి అందులో పాల్గొన్న చిన్నారులతో ఎస్పీ ముచ్చటించారు. అదే విధంగా ఈనెల 22వ తేదీన నిర్వహించే ఐదవ రోజు నిమజ్జనానికి ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సీఐ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎస్పీ అన్బురాజన్

రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఉరవకొండ విద్యార్థిని



జిల్లాస్థాయి సెమినార్ నిర్వహిస్తున్న అధికారులు

రాప్తాడురూరల్: చిరుధాన్యాలు–పోషకాహారమా? లేక ఆహార వ్యామోహమా? అనే అంశంపై బుధవారం అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో 8, 9,10 తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయి సెమినార్ నిర్వహించారు. మొత్తం 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాల బాటనీ లెక్చరర్ డాక్టర్ డి.రఘురాములు, బి.మనోహర్‌రెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఉరవకొండకు చెందిన ఎస్‌కే ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని షేక్ అయేషా సిద్దిఖీ జిల్లాస్థాయి విజేతగా నిలిచింది. ఈ విద్యార్థిని రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొంటుందని డీఈఓ నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అనంతపురం టవర్‌క్లాక్: సాయినగర్‌లోని స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో గురువారం సాయంత్రం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అక్కినేని శత జయంత్యుత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: తెలుగు వారే కాదు యావత్తు భారతదేశం గర్వించదగిన నటుడు అక్కినేని లాంటి వారు మళ్లీ జన్మించడం కష్టమని పలువురు వక్తలు అన్నారు. చంద్రా సినీ ఆర్కెస్ట్రా నేతృత్వంలో ఆఫీసర్స్ క్లబ్ వేదికగా బుధవారం రాత్రి అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలను అనంత కళాకారులు ఘనంగా ప్రారంభించారు. శ్రీరాములు, శ్రీదేవి, రాజేశ్వరి, కేశవ, శ్రీనివాసులు తదితరులు అక్కినేని జీవితాన్ని గుర్తు చేసుకున్నారు. దేవదాసు, మూగమనసులు, చెంచులక్ష్మి పాటలతో మార్మోగించారు. అలాగే పాత పాటల ప్రేమికుల సమూహం, ఘంటసాల ఆరాధన సమితి వారు సంయుక్తంగా ఇటీవల రాజీవ్ పార్కులో ఏర్పాటు చేసిన ఘంటసాల విగ్రహం వద్ద ఆ పాత మధురాలతో గాయనీ గాయకులు అక్కినేనికి ఘనంగా నివాళులర్పించారు. పాలసముద్రం నాగరాజు, రామయ్య, ఆచార్య సుధాకరబాబు, రామయ్య తదితరులు పాత తరం పాటలతో ప్రేక్షకులను మైమరిపించారు. ఏడాది మొత్తం అక్కినేని శత జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు.



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పూజలందుకున్న వినాయకులు



రహమత్ నగర్‌లో కిట్ క్యాట్ చాక్లెట్లతో అలంకరించిన బుజ్జి వినాయకుడు



అరవింద్ నగర్‌లో గోమతి చక్రాలతో ముస్తాబైన వినాయకుడు



కమలా నగర్‌లో సిద్ధి బుద్ధి గణేశుడు



బోయ వీధిలో ముస్తాబైన గణపయ్య

సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

అమ్మా చెత్త వాహనం వస్తోందా?

అనంతపురం కార్పొరేషన్: అమ్మా చెత్త వాహనం వస్తోందా? కాలువలు తరచూ శుభ్రం చేస్తున్నారా? పారిశుధ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ మేయర్ వసీం తను ప్రాతినిధ్యం వహిస్తున్న 38వ డివిజన్ ప్రజలను ప్రశ్నించారు. బుధవారం ఆ డివిజన్‌లోని నిర్వాసితుల ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త వాహనాలు, పుష్‌కాట్‌లకు అందించాలని విజ్ఞప్తి చేశారు. సుందర అనంతకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి వలంటీర్లు, ఏఎన్ఎం, తదితర సిబ్బంది వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటా సర్వేను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్య రికార్డును నమోదు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు ఖాజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

కొత్తగా మరో 2 వేల ఇళ్ల మంజూరు

కనగానపల్లి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ప్రభుత్వం కనగానపల్లి మండలానికి మరో 2,153 ఇళ్లను మంజూరు చేసిందని జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, భూ పంపిణీ కార్యక్రమాలపై మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వం కనగానపల్లి మండలానికి ఇప్పటివరకూ ఆరు వేలకు పైగా ఇళ్లు మంజూరు చేసిందన్నారు. మొదటి రెండు విడతల కింద మంజూరు చేసిన 4 వేల ఇళ్లలో సగానికి పైగా నిర్మాణాలు పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటిని గ్రామాల వారీగా కేటాయించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. వీటిని స్థానిక గ్రామాల్లో ఉన్న జగనన్న కాలనీల్లో లేదా సొంత స్థలాల్లో నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. హౌసింగ్, రెవెన్యూ సిబ్బంది సక్రమంగా పనిచేసి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రమాదేవితో కలసి భూ పంపిణీ కార్యక్రమంపై రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, డైరెక్టర్ ప్రభాకర్, నాయకుడు నాగముని, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ అంకె అశోక్, తదితరులు పాల్గొన్నారు.



పతాకధారులుగా హర్మన్‌ప్రీత్ సింగ్, లవ్లీనా

ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ వ్యవహరించనున్నారు. ఈనెల 23న చైనాలోని హాంగ్జూ నగరంలో ఆసియా క్రీడలకు తెర లేవనుంది. అస్సాంకు చెందిన 25 ఏళ్ల లవ్లీనా టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం, ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. పంజాబ్‌కు చెందిన హర్మన్ భారత్ తరఫున 191 మ్యాచ్‌లు ఆడి 155 గోల్స్ చేశాడు.

రష్మిక శుభారంభం



అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన ఆమె, డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పెర్త్‌లో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 6-3తో జెస్సీ కులే (ఆస్ట్రేలియా)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)-మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-4, 7-6 (7/5)తో ఎలీనా మిసిచ్ (ఆస్ట్రేలియా)-మిచికా ఒజెకి (జపాన్) జంటను ఓడించింది.

భారత్ సంచలనం

వాలీబాల్‌లో కొరియాపై విజయం ● ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు అర్హత

హాంగ్జూ (చైనా): మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల వాలీబాల్ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. గ్రూప్ 'సి'లో టాప్ ర్యాంక్‌లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం కంబోడియా జట్టును ఓడించిన భారత జట్టు బుధవారం పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా జట్టును భారత్ బోల్తా కొట్టించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు 25-27, 29-27, 25-22, 20-25, 17-15తో దక్షిణ కొరియాపై గెలిచింది. 1966 నుంచి ప్రతి ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా స్వర్ణ, రజత, కాంస్య పతకాల్లో ఏదో ఒక పతకం సాధిస్తూ వస్తోంది. భారత జట్టు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. కొరియాతో 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా అమిత్ అత్యధికంగా 24 పాయింట్లు స్కోరు చేశాడు. వినిత్ కుమార్, అశ్వల్ రాయ్ 19 పాయింట్ల చొప్పున సాధించారు. మనోజ్ ఎనిమిది పాయింట్లు, ఎరిన్ వర్గీస్ ఏడు పాయింట్లు అందించారు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కొరియా రజత పతకం నెగ్గగా, భారత్ 12వ స్థానంలో నిలిచింది.



రోయింగ్‌లో జోరు...

రోయింగ్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. మహిళల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో అశ్వతి, మృణమయి సాల్గావ్‌కర్, ప్రియా దేవి, రుక్మిణి, సానాలీ, రీతూ, వర్ష, తెన్‌దోన్‌తోయ్ సింగ్, గీతాంజలిలతో కూడిన భారత జట్టు కూడా ఫైనల్లోకి ప్రవేశించింది.

నేడు మలేసియాతో భారత మహిళల పోరు



మహిళల టి20 క్రికెట్‌లో భారత నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మలేసియాతో నేడు జరిగే పోరులో స్మృతి మంధాన బృందం బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడంతో పాటు పతకం రేసులో నిలుస్తుంది. ఉదయం గం. 6:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 694 పాయింట్లతో నంబర్ వన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 9వ స్థానంలో ఉన్న ఈ హైదరాబాదీ ఏకంగా ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో సిరాజ్ టాప్‌గా నిలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో నంబర్‌వన్‌గా నిలిచిన అతను రెండు నెలల తర్వాత ఆసీస్ పేసర్ జోష్ హాజల్‌వుడ్‌కు ఆ స్థానాన్ని కోల్పోయాడు. ఆసియా కప్ ఫైనల్లో 21 పరుగులకే 6 వికెట్లు తీసిన ప్రదర్శనతో ఇప్పుడు మళ్లీ శిఖరానికి చేరాడు. కెరీర్‌లో అత్యుత్తమ దశను చూస్తున్న సిరాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ చేశాడు. కొంత కాలం క్రితం చనిపోయిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ 'మిస్ యు పాపా' అంటూ క్యాప్షన్ పెట్టాడు. తనను తల్లిదండ్రులు ఆశీర్వదిస్తున్న ఫోటోను వారిద్దరు చూస్తున్న చిత్రానికి తాను గ్రౌండ్‌లో ఆడుతున్న ఫోటోను అతను జత చేశాడు.



అమెరికాలోని మూడు నగరాల్లో...

టి20 ప్రపంచకప్ వేదికలు ఖరారు



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌నకు సంబంధించి అమెరికాలోని మూడు వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగుతాయి. బ్రోవార్డ్ కౌంటీ (ఫ్లోరిడా), గ్రాండ్ ప్రయరీ (డాలస్), ఐసన్‌హోవర్ పార్క్ (న్యూయార్క్) స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని ఐసీసీ పేర్కొంది. టి20 ప్రపంచకప్ అమెరికాలో జరగడం ఇదే మొదటిసారి. 2024 టోర్నీని వెస్టిండీస్‌తో కలిసి యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించనుంది. ఈ టోర్నీలో మొదటిసారి 20 జట్లు పాల్గొనబోతున్నాయి. ఇటీవలి వరకు ఈ టోర్నీని అమెరికాలో నిర్వహించడంపై సందేహాలు ఉన్నా ఐసీసీ తాజా ప్రకటనతో సందిగ్ధత తొలగింది. వచ్చే ఏడాది జూన్ 4-జూన్ 30 మధ్య టోర్నీ జరిగే అవకాశాలు ఉన్నాయి.

'నా అకౌంట్‌లో 80 వేలే ఉన్నాయి'

భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆవేదన



న్యూఢిల్లీ: అతను భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు... ఏడాది మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఏటీపీ టోర్నీలలో పాల్గొంటున్నాడు. టోర్నీల్లో ప్రదర్శనకు ప్రైజ్‌మనీ కూడా దక్కుతుంది. మామూలుగా అయితే టెన్నిస్ ఆటగాళ్లు బాగా డబ్బున్నవాళ్లు అయి ఉంటారని, ఏ స్థాయిలో ఆడినా విలాసవంతమైన జీవితం ఉంటుందనిపిస్తుంది. కానీ ప్రపంచ టెన్నిస్‌లో వాస్తవ పరిస్థితి వేరు. అది ఎంత ఖరీదైందో... అగ్రశ్రేణి స్టార్లు తప్ప 100 కంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్ల స్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కటి ఉదాహరణ! భారత్‌కు చెందిన ప్రపంచ 159వ ర్యాంకర్ సుమీత్ నగాల్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన బ్యాంక్ అకౌంట్‌లో ఇప్పుడు 900 యూరోలు (సుమారు రూ. 80 వేలు) మాత్రమే ఉన్నాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రైజ్‌మనీల ద్వారా వచ్చిన డబ్బు, ఐఓసీఎల్ కంపెనీ జీతం, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తం టెన్నిస్‌లోనే పెడుతున్నానని, అయినా సరే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించాడు. డబ్బులు లేకపోవడంతో ఫిజియో కూడా లేకుండా ఒకే ఒక కోచ్‌తో తాను పోటీల్లో పాల్గొంటున్నానని అన్నాడు. టెన్నిస్ సర్క్యూట్‌లో నిలకడగా ఆడుతూ టాప్-100లో చేరాలంటే ఏడాదికి కనీసం రూ. 1 కోటి ఖర్చు అవుతుందని నగాల్ చెప్పాడు. 'కొన్నేళ్లుగా నిలకడగా ఆడుతూ భారత నంబర్‌వన్‌గా ఉన్నా నాకు కనీస మద్దతు కరువైంది. ప్రభుత్వం 'టాప్స్' పథకంలో నా పేరు చేర్చలేదు. డబ్బులు లేక జర్మనీలోనే టెన్నిస్ అకాడమీలో శిక్షణకు దూరమయ్యాను. నేను గాయపడి ఆటకు దూరమైనపుడు అసలు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. రెండుసార్లు కోవిడ్ రావడంతో ర్యాంక్ పడిపోయింది. మన దేశంలో ఆర్థికంగా మద్దతు లభించడం చాలా కష్టం. నా వద్ద ఉన్న డబ్బంతా ఆటకే పెడుతున్నా. గత రెండేళ్లలో ఏమీ సంపాదించలేదు. నేనేమీ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండటం లేదు. అన్నీ కనీస అవసరాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. పూర్తిగా చేతులెత్తేశాను' అని నగాల్ తన బాధను చెప్పుకున్నాడు.

పతకానికి విజయం దూరంలో...

- సెమీస్‌లో పోరాడి ఓడిన అంతిమ్
- నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్‌పై నెగ్గిన భారత రెజ్లర్



అంతిమ్ పంఘాల్

బెల్‌గ్రేడ్ (సెర్బియా): భారత రెజ్లింగ్ రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటుకుంది. అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా చరిత్ర సృష్టించిన అంతిమ్... ప్రస్తుతం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచింది. సెమీఫైనల్లో అంతిమ్ 4-5 పాయింట్ల తేడాతో వనెసా కలాద్‌జిన్‌స్కాయా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో అంతిమ్ గెలిస్తే పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖరారవుతుంది. సోఫ్‌ట్‌విరా ఒర్షుష్ (హంగేరి), ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్) మధ్య బౌట్ విజేతతో కాంస్య పతకం పోరులో అంతిమ్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో అంతిమ్ 3-2తో డిఫెండింగ్ చాంపియన్ డొమినిక్ ఒలివియా పారిష్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అంతిమ్ 10-0తో రొక్సానా మార్టా జసినా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9-6తో నటాలియా మలిషెవా (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన మనీషా (62 కేజీలు), ప్రియాంక (68 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పతాకంపై, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

సినిమా

మళ్లీ జోడీగా...



● సాయి పల్లవి, నాగచైతన్య

హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి మళ్లీ జోడీగా కనిపించనున్నారు. 'లవ్ స్టోరీ' (2021) వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత ఈ ఇద్దరూ 'ఎన్‌సీ 23'లో (వర్కింగ్ టైటిల్) మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న చిత్రమిది. నాగచైతన్య, చందు మొండేటి కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రం అవుతుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

తెలుగోడి జానపదం దమ్ము చూపించింది

- నిర్మాత 'బన్నీ' వాసు




● విద్య, శ్రీకాంత్, శివానీ, రాహుల్, 'బన్నీ' వాసు

''ఒక పాట హిట్ అయితే సక్సెస్ మీట్ చేయడం మాకు తెలిసి ఇదే తొలిసారి. మా 'కోట బొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగి లింగి లింగిడి...' పాట తెలుగోడి జానపదం దమ్ము చూపించింది. ఈ పాటకి పి. రఘు సాహిత్యం అందించడంతో పాటు పాడారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, శ్రీకాంత్ మేక, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగి లింగిడి...' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తోందంటూ సక్సెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ– ''చాలా కాలం తర్వాత మంచి సినిమా చేశాననే అనుభూతి ఉంది'' అన్నారు. ''నా జీవితంలో గుర్తుండిపోయే పాట వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రాహుల్ విజయ్. ''ఈ పాట ఎంత పాపులర్ అయ్యిందో సినిమా కూడా అలాగే ఉంటుంది'' అన్నారు శివానీ రాజశేఖర్. ''నా సినిమాలో జానపదం పాట పెట్టాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది'' అన్నారు తేజ మార్ని.

హిట్ అయినదే పెద్ద సినిమా

- శ్రీకాంత్



● 'రుద్రం కోట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఓ దృశ్యం

''రుద్రం కోట' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇప్పుడు ఏది హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతోంది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి, కొత్తవారిని ప్రోత్సహించాలి'' అన్నారు నటుడు శ్రీకాంత్. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా రాము కోన దర్శకత్వం వహించిన చిత్రం 'రుద్రం కోట'. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్, నటి రాశీ విడుదల చేశారు. రాశీ మాట్లాడుతూ– ''రుద్రం కోట' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు జయలలిత. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద సినిమాగా చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనిల్ ఆర్కా.

నాగేశ్వరరావుగారు నట విశ్వవిద్యాలయం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



● విగ్రహావిష్కరణ చేస్తున్న వెంకయ్య నాయుడుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని వెంకట్, నాగార్జున

''తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు అని ఎప్పుడూ చెబుతుంటాను. తన జీవితాన్ని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవడం నాగేశ్వరరావుగారిలోని గొప్పతనం. అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, మహా కవి కాళిదాసు.. ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగి పోయేవారు. నాగేశ్వరరావుగారు ఒక పెద్ద నటనా విశ్వవిద్యాలయం. ఈ రోజు పరిశ్రమలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ విశ్వ విద్యాలయంలో విద్యార్థిననుకుని, ఆ గుణగణాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌కు మంచి ప్రణాళికలు వేసుకున్నట్లవుతుంది'' అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. బుధవారం (సెప్టెంబరు 20) ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని వెంకయ్యనాయుడు ఆవిష్కరించి, మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు మహానటులు.. మహా మనిషి. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావుగారు. అవతలివాళ్లు నేర్చుకోదగ్గ కొన్ని మంచి సంప్రదాయాలు, విలువల్లో ఆయన జీవించి, నటించి మనకు చూపించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. నాగేశ్వరరావుగారు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, జీవిత చరమాంకంలోనూ నటిస్తూనే ఉన్నారు. కొంతమంది జీవిత కాలంలో జీవిస్తారు. జీవిత కాలం పూర్తయిన తర్వాత కూడా జీవించే మహానుభావులు కొందరు. వారిలో అక్కినేని నాగేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన మంచి నటులే కాదు.. పరిణతి చెందిన గొప్ప ఆశావాది కూడా. ఆయన నాస్తికుడు. గొప్ప తాత్త్వికుడు. ఆయన పెద్దగా చదువుకోలేదని అంటారు. కానీ జీవితాలను చదివారు. జీవితంలో ఆయన పోరాటం చేశారు.. జీవితాన్ని ప్రేమించారు.. ఆస్వాదించారు. జీవితంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి చూపించారు'' అని అన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ– ''1950 సమయంలో నాగేశ్వరరావుగారు సినిమాల్లో నటించడం ప్రారంభించాక, సొంతిల్లు కట్టుకోవడానికి ముందే మద్రాస్ విశ్వ విద్యాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పాతిక వేలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి కూడా పాతిక వేలు విరాళం ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1959లో లక్ష రూపాయల విరాళం ఇచ్చి గుడివాడ కళాశాలను నిలబెట్టారు. నాలాంటివారు ఎందరో చదువుకోగలిగారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఓ విప్లవానికి ఆయన నాంది పలికారు'' అన్నారు.

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ – ''అక్కినేని నాగేశ్వరరావుగారి కష్టం, కళల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఆయన్ను ఓ లెజెండ్‌ని చేశాయి. యువ నటీనటులకు నాగార్జునగారు స్ఫూర్తి అని నా ఫ్రెండ్స్ సర్కిల్స్‌లో చెబుతుంటారు. నాగార్జునగారేమో తన తండ్రి చూపించిన మార్గంలో నడిచానని చెబుతుంటారు'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ– ''ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే.. ఆయన ఓ మహానుభావుడు... ఆయన మనతో లేరనే భావన నా మనసులో చిన్నతనం నుంచే ముద్రపడింది. ఏ విగ్రహం చూసినా నాకు అదే అనిపించేది. అందుకే వెంకయ్యనాయుడుగారు ఆవిష్కరించేంతవరకూ నేను నాన్నగారి విగ్రహాన్ని చూడలేదు. చూడబుద్ధి కాలేదు. ఎందుకంటే నాన్నగారు మాతో లేరనే విషయాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోనని... శిల్పి వినీత్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా చెక్కాడు. నాన్నగారు అద్భుతమైన జీవితాన్ని జీవించారు. తరతరాలుగా గుర్తుపెట్టుకునే పాత్రలు చేసిన నటుడు. కోట్లమంది తెలుగు ప్రజలు, అభిమానులు ప్రేమించిన వ్యక్తి.. ఇలా వివిధ రకాలుగా నాన్నగారు అందరికీ తెలుసు. మాకు మాత్రం నాన్నగారు మా గుండెలను ప్రేమతో నింపిన వ్యక్తి. నన్ను, నా తోబుట్టువులను, మా పిల్లలను.. అందర్నీ చల్లగా చూసిన వ్యక్తి. మాకు మనసు బాగున్నా, బాగోలేకున్నా నాన్నగారి దగ్గరికి వెళ్లి కూర్చుంటే చాలు అన్నీ సర్దుకునేవి. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్నగారికి నచ్చిన స్థలం. నచ్చిన చోట విగ్రహం పెడితే ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు అంటారు. సో.. ఆయన ప్రాణంతో మా దగ్గరే ఉన్నారని, ప్రాణంతో మా మధ్యనే నడుస్తున్నారని అనుకుంటున్నాము. నా ఆలోచనల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి, ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన నాన్నగారి అభిమానులకు ధన్యవాదాలు'' అన్నారు.



● అఖిల్ ● నాగచైతన్య

నాగచైతన్య మాట్లాడుతూ– ''ఏయన్నార్‌గారంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ పెద్ద, ఓ గొప్ప నటుడు, క్లాసిక్ ఐకాన్‌గా పరిచయం. ఆయన చిత్రాలు, ఆయన చేసిన ప్రయోగాలు ప్రేరణ కలిగించే కేస్ స్టడీగా చాలా మంది ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుతుంటారు. ఈ జాబితాలో నేనూ ఉన్నాను. తాతగారితో నేను కలిసి నటించడం నా అదృష్టం. మన పుట్టుక మన చేతిలో ఉండదు. అలాంటిది అక్కినేని నాగేశ్వరరావుగారి మనవడిగా పుట్టడం నా అదృష్టం'' అని అన్నారు.

తాత ఏయన్నార్‌కు అఖిల్ నివాళులర్పించారు.

ఏయన్నార్ పెద్ద కుమారుడు వెంకట్ అక్కినేని మాట్లాడుతూ– ''మనిషి ఎంత కీర్తి సంపాదించినా, ఎంత ధనం గడించినా తలగడ మీద తల పెట్టగానే నిద్రపోవడం అనే ఆస్తి, సౌకర్యం ఏ ధనం ఇవ్వలేదు. ఏయన్నార్‌గారు తలగడ మీద తల పెట్టగానే హాయిగా నిద్రపోయేవారు. 1974లో బైపాస్ సర్జరీ జరిగింది. సర్జరీ ముందు రోజు నర్సు నిద్రకోసం మాత్ర ఇస్తే తీసుకోలేదు. ఏ మాత్ర వేసుకోకుండానే హాయిగా నిద్రపోయారు. ఆ తర్వాత ఆయన జీవితం అందరికీ తెలిసిందే. నాకు మరుజన్మ అంటూ ఉంటే ఆయన సన్నిధిలోనే ఉండాలనుకుంటున్నాను. అన్నపూర్ణ సంస్థ, ఏయన్నార్ ఫిల్మ్ స్కూల్, కాలేజీ, ఆయన చిత్రాలు, ఫ్యాన్స్ తీపి గుర్తులు'' అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారు ఒక గ్రంథం. ఆయన 'మరపురాని మనుషులు' సినిమాకు అసోసియేట్‌గా చేశాను. అన్నపూర్ణ సంస్థలో ఎన్నో సినిమాల్లో నటించాను'' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ– ''రైతు కుటుంబంలో పుట్టి అద్భుతమైన స్థితికి చేరుకున్న వ్యక్తి నాగేశ్వరరావుగారు. మహానట వృక్షం. కళాకారులకు గొప్ప వరం. స్వయంశిల్పి. స్నేహశీలి. అద్భుతమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి'' అన్నారు.

ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ– ''ఓ వేడుకలో నాగేశ్వరరావుగారితో మాట్లాడే అవకాశం లభించింది. స్టార్ అయిన మీరు 'మిస్సమ్మ' సినిమాలో కమెడియన్‌గా ఎందుకు చేశారు? అని ఆయన్ను అడిగాను. 'దేవదాసు' తర్వాత అన్నీ తాగుబోతు పాత్రలే వస్తున్నాయని, ఇమేజ్ మార్చుకోకపోతే ఇబ్బందవుతుందేమోనని, ఆ పాత్రను తానే అడిగి మరీ చేశానని చెప్పారు. నాగేశ్వరరావుగారికి ఆయనపై ఆయనకు ఉన్న నమ్మకానికి నమస్కారం చేయాలనిపించింది'' అన్నారు.



● రామ్‌చరణ్, నమ్రత, మహేశ్ బాబు

జయసుధ మాట్లాడుతూ– ''నాగేశ్వరరావుగారితో ఎక్కువ సినిమాలు చేయడం నా అదృష్టం. క్రమశిక్షణతో పాటు ఆయన దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు.

ఏయన్నార్ కుమార్తె నాగ సుశీల మాట్లాడుతూ– ''అందరికీ పండగలు ఉంటాయి. కానీ మా అక్కినేని అభిమానులకు నాన్నగారి జయంతే పండగ. అభిమానుల ప్రోత్సాహం వల్లే ఈ కార్యక్రమం సాధ్యమైంది. అమ్మానాన్నలు మేం ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకునేవారు. అలా మేమందరం కలిసే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేశాం'' అన్నారు.

సుశాంత్ మాట్లాడుతూ– ''తాతగారు తన జీవితంలో కృతజ్ఞతకు విలువ ఇచ్చేవారు. ఇండస్ట్రీలో తారాస్థాయికి ఎదిగిన ఆయనకు కళామతల్లికి తిరిగి ఇవ్వాలని ఉండేది. అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఏయన్నార్ నేషనల్ అవార్డు, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా.. ఇలా ఎన్నో ఆయన కృతజ్ఞతలోంచి వచ్చిన ఆలోచనలే'' అన్నారు.

''నాగేశ్వరరావుగారి విగ్రహం పనులను నాకు అప్పగించిన అక్కినేని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. దాదాపు ఐదున్నర నెలలు వర్క్ చేశాం'' అన్నారు విగ్రహ రూపకర్త వినేష్ విజయన్.

ఈ కార్యక్రమంలో అమల, సుప్రియ, సుమంత్. ఇలా అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, శ్రీకాంత్, మంచు విష్ణు, నాని, నాజర్, అనుపమ్ ఖేర్, అల్లు అరవింద్, అశ్వినీదత్, సి. కల్యాణ్, కేఎల్ నారాయణ, 'దిల్' రాజు, చినబాబు, నాగవంశీ, బి. గోపాల్, వైవీఎస్ చౌదరి, పి. కిరణ్, గుణ్ణం గంగరాజు, విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొని, అక్కినేని నాగేశ్వరరావుకి నివాళులు అర్పించారు.